# పెన్నిధి

ఒకానొక లేడీస్ క్లబ్బు ఆవరణలో ఆగిన కొన్ని కార్లలో నూకరాజు సొంతంగాని కారూవున్నది. సమయం సాయంత్రం. నూకరాజు కారుని ఆనుకునించున్నాడు. అతని ముందోకుర్రాడు నూకరాజు చెబుతూన్న ప్రతి చిన్న మాటని అతిశ్రద్ధగా వింటున్నాడు.

"ఒరేయ్ నాయనా! నేను చెప్పేదంతా నిజంరా. సాధారణంగా నేను కోతలు కోయను. ఇక్కడకొచ్చే జాతికి ఆడామగా అనే తేడాలేదురా సన్నాసి! అంతెందుకు ఈ కారు నా చేతికొచ్చి ఎన్నాళ్ళయిందనీ, ఆర్నెల్లు. హార్డ్లీ సిక్స్ మంత్స్. (ఏడవకరా వెధవా, నేను యసల్సీ తప్పినోడినైతే నయ్యేనుగానీ, ఇంగ్లీషీమధ్య బాగావంటబట్టింది ఏవంను కోకు) ఎంతరద్దీగా బతుకుతున్నానో నీకు తెలీదులాగుంది. లేచీలేవడంతోటి అమ్మగారింటికొచ్చేసి, ఒక దండం పారేసి కారెక్కి స్టీరింగుదగ్గిర కూచుంటాను: నేనమ్మగారి డ్రైవర్ని.

అక్కడ్నుంచి వూరేగింపు, ఆస్పత్రి, యిల్లు మళ్ళా ఆస్పత్రి యిల్లు. మధ్య మధ్య ఖబుర్లు. పేషెంట్లు, వాళ్ళ బాధలు, సుఖాలూ, నొప్పులూ, జ్వరాలూ, అవన్నీ అయింతర్వాత క్లబ్బులు. ఆడకో క్లబ్బు, మగకో క్లబ్బు, పిల్లలకో క్లబ్బు, ముసలోళ్ళకో క్లబ్బు, సినిమాలు, నాటకాలు, సభలూ, టీపార్టీలూ, డిన్నర్లూ — శేయ్‌దాసూ! నీ కళ్ళు తిరగడం లేదురా! నిజం చెప్పు" అన్నాడు నూకరాజు.

రామదాసు బుధ్ధిగా తలూపి నించున్నాడు.

డాక్టర్ ప్రమీలగారి కారుడ్రయివర్ నూకరాజు. చాకులాంటి మనిషతను. అందుచేత అతను లేడీస్ క్లబ్బు గురించి కొంతసేపు మాట్లాడేడు.

"ఊళ్ళో వున్నయువంటి వెలుగంతా యిక్కడ చేరి ఖబుర్లాడతాయి. నవ్వుకుంటాయి చాడీలు చెప్పుకుంటాయి. నోళ్ళు తిప్పుకుంటాయి. గొప్పలు చాటుకుంటాయి బాధలు దాచుకుంటాయి. మగాడికి చాతకాని పనులు కొన్నిక్కడే తీగాలమీద సెటిలై పోతాయి. అంతే దునుకి డాక్టరమ్మగారి కారునడిపే నేనెంత గొప్పవెధవనో నీకు తెలుసా?_అలా గంగిరెద్దులా తలూపకోకేయ్ నాకు తల్నొప్పి నీకేం తెలీదని నాకు తెలుసు. ఇక్కడికి నువ్వొచ్చినట్టే మునుపో బి. ఎ. గాడు ప్రత్యేకంగా నాకోసమొచ్చేడు. వాడు నాకు దూరబ్బాంధువు. బావమరిది వరస ఏరా బావా, అన్నాడు ఎంతో దిగుల్గో. నా కడుపు చెరువై పోయింది. వాడలా సరసంగా పలకరించే సరికి ఏంకావాలిరా అన్నాను. 'ఉద్యోగం' అన్నాడు బి. ఎ.

గాడు. నాకు జాలికలిగింది. నేనుత్త జాలిసన్నాసినిగదా. అంచేత వాడి భుజంతట్టి నీకేం ఫర్లేదు నువ్వెళ్ళిపో నేను చూస్తానని మాటిచ్చేసేను. తిన్నగా డాక్టరమ్మగారికి వైనం చెప్పేను. ఆవిడ ప్రభావతమ్మగారికి—"

"ప్రభావతమ్మగారికే!" అన్నాడు రామదాసు ఖంగారు పడిపోతూ.

"గేదెలాగా అరవకు. ఎవరన్నా వింటే ఏం బాగోదు అప్పను నువ్వెవరికోస మొచ్చావో సరిగ్గా ఆ ప్రభావతమ్మగారితోనే మాటాడేను. అయ్యిందా – మూడోరోజున బావమరిది బి.ఎ. గాడు ఫైళ్ళతో ప్రత్యక్షమై 'థేంక్స్‌రా బావా' అన్నాడెంతో ఆనందంగా. గనక ఇదంతా ఏమిటంటావ్. ఇంద్రజాలం. నేను చెబితే నమ్మవుగానో రేయ్–ఈ క్లబ్బులో జరగని పనంటూ లేదనుకో. ఆఫీసర్లతో చివాట్లుతినే అన్‌లక్కీగాళ్ళు, ప్రమోషన్లకోసం బెంగెట్టుకున్న చాతకానివాళ్లూ, ట్రాన్స్ఫర్‌లూ, ఇంక్రిమెంట్లూ, ఎరన్డ్ లీవులూ—సిక్కు లీవులూ, పంచదారకోటాలూ, విలువైన పర్మిట్లూ, ఇన్‌కం టాక్సు మతలబులూ, తోకక్కోయడాలూ ఒక్కటేమిటి బ్రాతంద్రీ. అన్ని తతంగాలకీ యిది కేంద్రస్థానం. ఆడదాని మాట వినని మగాడెవడైనా వుంటే, వాడికో బైకొట్టి వాడి ఫొటోని నట్టింట పెట్టుకుంటాను. చూపించేవడయినా కనిపిస్తే. అందుచేత దాసూ, నీ కొచ్చిన భయంలేదు. నీకుద్యోగం తప్పకుండా దొరికితీరుతుంది. ఏదీ, ముందోసిగరెట్టు తగలెయ్. నోరెండిపోయింది" అన్నాడు నూకరాజు.

రామదాసు జేబులోంచి సిగరెట్టుపెట్టెతీసేడు. దాంతో పాటు సిఫారసు ఉత్తరవూ బయటకొచ్చేసింది. నూకరాజు సిగరెట్టు తీసుకోకుండా, ఉత్తరం పట్టేసి పూర్తిగా చదివేడు.

"ఏమిటేమిటీ, బసవలింగంగారు స్వయంగా ప్రభావతమ్మగారికే రాసేరు. అవున్రాదాసూ, సదరు వారికి ప్రభావతమ్మగారికీ ఎంత పరిచయం ఏర్పడిందేవిటీ?"

"వారి మిల్లులో ప్రభావతమ్మగారికి ఖాతావుందిలే."

"అద్దదీ, అలా చెప్పు, నీ రొట్టెవిరిగి నేతిలో పడిందిరా దాసూ! ఏదా సిగరెట్టిలా తగలెయ్" నూకరాజు సిగరెట్టు ముట్టించి మళ్ళా అన్నాడు.

"మొన్నేమైందో తెలుసా? ఈ ప్రభావతమ్మగారే- సినీమా డైరక్టర్ని, వారి కుటుంబాన్ని యిక్కడికి పిలిపించేసి సన్మానం చేయించి అందరికీ జై కొట్టి పంపించేరు. ఆనక అమ్మగారి దూరబ్బంధువు నొకడ్ని మెల్లిగా వెండితెర కెక్కించేశాడు. ఇంత గొప్ప పని నీవల్లా, నావల్లా అవుతుందా, అవడుగనక వాళ్ళంతా మాయగాళ్ళు. నీకేం తెలీదులాగుంది, బుడ్డోడివి. లోకానుభవం తక్కువ...తప్పుకోరా బాబూ, ప్రభావతమ్మగారి కారొచ్చేస్తోం . నీ ఉద్యోగంసంగతి దేవుడెరుగు. ఆ కారుకిందపడితే కేసుండదు. ఆ డ్రైవరుగాడిది మనకంటే గొప్పగ్రేడు. అందుచేత వాడికళ్ళు బొత్తిగా కనిపించవసలు. తప్పుకో...ఎందుకైనా మంచిది. నాతోపాటు ఆ కార్లోకి ఓ నమస్కారం పారేయ్. రెడీ, వన్, టూ.

'త్రీ' అన్నారు మిసెస్ సుగుణా భానుమూర్తి.

“యస్; మేడమ్! నేను తెచ్చింది త్రీనే!” అన్నాడు బాలు అనే కుర్రాడు మూడు డ్రింకులిచ్చి.

సుగుణా భానుమూర్తి కోరిక ప్రకారం, శ్రీమతి విమల డ్రింకు పుచ్చుకుందిగాని, డాక్టర్ ప్రమీల పుచ్చుకోలేదు. డాక్టర్ ప్రమీల ఆ డ్రింకుని శారదకివ్వవలసిందిగా రికమెండ్ చేసింది. కాని. సుగుణాభానుమూర్తిగారు డాక్టరు మాటని వినిపించుకోలేదు. వినిపించుకున్నా ఖాతరు చేయలేదు. సమయానికి క్లబ్బు గుమ్మమెక్కుతూన్న ప్రభావతిని చూచి గంపెడంత ఆనందాన్ని మాటల్లో పొదిగి అన్నది.

“రండి, రండి హేవ్ ది డ్రింక్ ఫస్ట్.”

మిగిలిన మూడో డ్రింకుని ‘అకారణంగా’ బాలు అతి జాగ్రత్తగా ప్రభావతికి అందించేడు. ఈ చర్యలో అటు డాక్టర్ ప్రమీలా, ఇటు శారదా బాధపడిపోయేరు శారద మరింత కృంగిపోయి అనుకున్నది—

ప్రభావతీ, అదృష్టం నీది. రవణ నీకు దక్కేడు గనుక నువ్వు అదృష్టవంతురాలివై పోయావు. రవణని నేను కాదన్నాను. పెళ్ళిచూపులకొచ్చినప్పుడు రవణ నాకు అనాముకుడిలా కనుపించాడు అప్పట్లో నాకు రవణమీద ద్వేషం లేదు యిష్టమూ లేదు. ఇప్పుడిక్కడ నీ ప్రభావంచూస్తూంటే నాకు మతిపోయి, ఈర్ష్యకలుగుతోంది. నా బ్రతుకుమీద రోతకలుగుతుంది. నేను ప్రేమించి పెళ్ళిచేసుకున్న తర్వాత, ప్రేమంటే ఏమిటో తెలిసి వొచ్చింది. ప్రేమ ఒక పెద్ద ఊబి; జలుబు; గుడ్డిది, నా మొగుడు గుమాస్తా. కేవలం ఒక సాధారణమైన గుమస్తా. పేరు సుబ్బారావ్. కె. సుబ్బారావు.

గాల్లోవూడె బొమ్మతను. బియస్సి అతని క్వాలిఫికేసన్ అతనికి నేనే అధనమైన క్వాలిఫికేషన్ని. నేను పాడతాను. అందంగా పాడగలను. రేడియోలో ప్రోగ్రాము లిచ్చాను. అంతే అదొక్కటే నా మొగుడి క్వాలిఫికేషన్, పిటీ, పిటీ, పిటీ, బ్రతికిపో ప్రభావతీ, నీకే దిగులూ లేదు. ఘనత చెందిన మొగుడు, ఖరీదైన కారూ, మేడా, అదృష్టం నీది. నాకొచ్చే డ్రింకు నువ్వు తాగేశావ్. డాక్టరు ప్రమీలా, నేనూ మేమిద్దరం నీ ఒక్కదాంతో సరితూగలేకపోయాము. సుగుణా భానుమూర్తి నీకు కొండంత విలువ నిచ్చేసింది. సాక్షాత్తు లక్షల మనిషి నిన్ను గౌరవించి, నెత్తిన పెట్టుకుంది. బ్రతికిపోయేవ్."

ప్రభావతి కూర్చుంది. కూర్చుంటూనే అన్నది—

"ఏమిటో విశేషం? సభంత డల్‌గా వుందే"

"హెల్ విత్ ది క్లయిమేట్. ఇటీజ్ వెరీబేడ్ వెదర్" అన్నది సుగుణా భానుమూర్తి.

సుగుణాభానుమూర్తి అయిదోక్లాసు పాసయ్యింది. భానుమూర్తి ఎక్కువ చదువుకోలేదు. డబ్బులున్న చాలామంది. బి. ఏలు ఎమ్మేలు కానక్కరలేదు. డబ్బులున్న ప్రతివోట 'పవర్' వుంటుంది. ఆ పవర్ని ఇంతైన వాసనొకటి అలుముకుని .. నాగరికత నిచ్చేస్తుంది. అందుచేత సుగుణా భానుమూర్తి సాధారణంగా తెలుగు మాట్లాడి తనని తక్కువ చేసుకునే ప్రమాదానికి గురికాదు.

అక్కడ చేరిన చాలామంది కాసేపు 'వెదర్' గురించి

మాట్లాడేరు. మాట్లాడింతర్వాత అందరికీ విసుగుపుట్టుకొచ్చేసి నట్టు భావించేరు. ఉన్నట్టుండి విమల లేచినుంచుని వొళ్ళు విరుచుకుంది. అప్పుడక్కడ మగవాడెవడయినా వుండివుంటే మతిపోయి గింజుకుచచ్చేవాడు. అసలే అందమైన విమల, నుంచిని మరింత అందంగా వొళ్ళు విరుచుకోవడంతో సభంతా గందరగోళమైపోగా సుగుణాభానుమూర్తిగారు విమలని పరామర్శించేరు—

"ఏంటి విమలా? ఫిల్ సంథింగ్ బోర్?"

తెలుగు మాట్లాడరా సుగుణా భానుమూర్తి అసలు 'రంగు' (ఖచ్చితంగా బయటపడుతుందని ఆమెగూడా తెలుసుకొనక—'ఏంటి' అన్నందుకు బాధపడి, దిద్దుకొని ఇంగ్లీషులో అడిగింది)

"మీరన్నట్టు వెదర్ బాగాలేదు" అన్నది విమల బద్ధకంగా.

[అదంతా చిత్రమైన వాతావరణం ఇంగ్లీషు పలకరింపు అక్కడ ఎక్కువ. వాళ్ళేవిషయాన్నీ శ్రద్ధగా మాట్లాడుకోరు. మాటాడుకోవాలనివుంటే—సుగుణాభానుమూర్తి బొచ్చుకుక్క బుల్లి ముచ్చట్లూ కావాలి ప్రభావతమ్మ నెక్లెస్ ధర కావాలి, విమలమ్మ తాలూకు కొత్తరకం కాస్ట్యూమ్స్—దాని టైలర్లూ డిజైనర్లూ కావాలి, మనుషుల్లో గొప్పలు కావాలి, బేంకుల్లో నిలవలు కావాలి]

"నేనెవరికీ అక్కర్లేదు" అనుకుంది శారద.

"అవున్నేను ఎవరికీ అక్కరలేదు. నేను గుమాస్తా,

భార్యని. ఇక్కడ గుమాస్తా భార్యలొద్దు. నేను బాగా పాడతాను. గనక, ఆ అవసరమొచ్చినపుడే నేను కావాలి. అవసరాలెన్ని సార్లొస్తాయి? అయినా నాకెందుకీ మధ్య జెలసీ పెరిగిపోతోంది! భగవంతుడా నాకు కొన్ని మంచి ఆలోచన లివ్వు!"

గుమ్మందగ్గిర కూచున్న బాలు ఖస్సుమంటూ మూలిగేడు. బాలు కుక్కలాటి మనిషి. వాడికి మనిషిని వాసన చూడటం తెలుసు. వందగజాల్లో మనిషిని నిలబెట్టి వాడి తాహతేమిటో చెప్పగల నంబర్ వన్ వేటకుక్క. క్లబ్బుకి సంబంధించిన మనిషొచ్చే వాసన తగుల్తే లేచినుంచోని తలూంచుతాడు. ఎవడో లాటరీ కొట్టే మనిషయితే లేచి ఖస్సుమంటాడు. క్లబ్బు మెక్కుతుంది 'రామదాసు' గనుక వాడు విసుక్కున్నాడు.

"ఏందయ్యా? ఎవరు కావాలి నీకు?" అని రామదాసుని కదిపేడు. రామదాసు అదిరిచచ్చి, బిగ్గరగానే అనేసేడు.

"ప్రభావతమ్మగారికోస వొచ్చేను."

క్లబ్బులో మాటలాగి పోయేయి. అందరి చూపులూ రామదాసనబడే, ఒక పేద దాసుడిమీద కేంద్రీకరించబడ్డాయి. రామదాసు భయంతోనూ, సిగ్గుచేతనూ నిలువెల్లా నొణికిపోతూండగా, లోనికి రావలసిందిగా ప్రభావతి తలతో సైగ చేసింది.

బ్రతుకు జీవుడాంటూ అతనొచ్చి నమస్కారంచేసి వినయంగా నుంచున్నాడు.

"ఎవర్నువ్వ్?" ప్రభావతి చాలా ఖచ్చితంగా అడిగింది.

"నాపేరు రామదాసండి. బసవలింగంగారు పంపగా వొచ్చేనండి. వారొక ఉత్తరం నాచేత పంపేరండి." రామదాసు పోర్షను వొప్పగించేసేడు.

"ఇలాయివ్వు" అన్నది ప్రభావతి.

అతను ఉత్తర మిచ్చేడు. దాన్నామె చదివింది. చదివి విసుగ్గా అంవబోయి, బాగుండదని దయతలచి నెమ్మదిగా అన్నది.

"ఆల్ రైట్ నేను పాస్ చేస్తానని చెప్పు. నువ్వెళ్ళు."

రామదాసు మరో నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

"ఉద్యోగంకోస మొచ్చేడు. బసవలింగంగారని రైస్ మిల్లర్. క్వైట్ ఎజెంటిల్మేన్ రికమెండ్ చేసేడు. రమణారావు గారితో చెప్పాలి. ఇప్పటికే బోల్డు అప్లికేషన్సు! ఏమంటారో ఏమో?" అన్నది ప్రభావతి జనాంతికంగా.

"డోంటు డోంటు డౌట్ సేడౌట్. హివిల్ డు" అన్నది సుగుణా భానుమూర్తి.

పావుతక్కువ ఏడింటికి ప్రభావతి లేచి నుంచుని ఓ వార్త చెప్పింది.

క్షమించాలి. నేనో విషయం చెప్పడంమరచిపోయేను. రేపు నా బర్త్ డే. మీరందరూ రావాలి"

అలాగే అన్నారు కొందరు; అనుకున్నారు మరికొందరు.

* * *

సుబ్బారావిల్లు!

ప్రేమ, ప్రేమ, ప్రేమ, ప్రేమ పిరీడు దాటేసేం సుబ్బారావ్. కేవలం ప్రేమతో మనం యెంతకాలం బ్రతుకుతాం? ఇప్పుడు మనల్ని జనం గుర్తించాలి. మనం వెలుగులోకి రావాలి. ఆలోచించు. ఆలోచించి – చక్కటి ప్లానొకటి తయారుచెయ్. ఆ ఫైళ్ళన్నీ యింటికెందుకు తెచ్చేవ్. వాటితో నువ్వు కుస్తీపడుతుంటే మనప్లాన్ గతేమిటి? ఆఫీసు ఫైళ్ళూ, నామీద ప్రేమా – ఈ రెండే నా జీవితానికి ముఖ్యమైనవి. డామ్ లైఫ్ డర్టీ లైఫ్ అని శారద మనసులో రాసుకునే మాటలకి సుబ్బారావెప్పుడూ సమాధానం ఇవ్వలేదు.

"శారూ! ఈవెన్నెల్చూడు. ఎంతబాగుందో. అరవై రెండు మే నెలలో కాబోలు మనిద్దరం మంగినిపూడి వెళ్ళేం గుర్తుందా?" అన్నాడు సుబ్బారావు శారదముందు కూర్చుని.

"మీకెన్ని జ్ఞాపకాలండి!" అన్నది శారద విసుగుని గుండెల్లో దాచుకొని.

"జ్ఞాపకాలనకు శారూ! అవన్నీ తీపిగుర్తులు. నువ్వూ నేను ఆ రాత్రి సముద్రంలోకి దిగేం—

"అప్పుడప్పుడు పెద్ద రొంపిలోకి మనం దిగేం" అనుకుంది శారద.

"స్నానంచేసి వొడ్డుకొచ్చిన తర్వాత నువ్వో పాట పాడేవు ఎంత బాగా పాడేవని!"

"ఇప్పుడూ పాడమంటారేమిటి ఖర్మం!" అన్నది శారద.

"ఎప్పుడూ పాడమంటాను. ఆఖరి ఘడియల్లోనూ నీ పాటే కావాలి."

"ఛ. అదేం మాట!"

"శారూ!"

"ఏమిటండీ బాబూ!"

"మన పాపపోయి ఎన్ని నెలలయింది?"

"............"

"అదెంత చక్కగా పాడేదిశారూ! ఆ గొంతులో యెన్నెన్ని మధురాలు చూసేంకాదూ? అమృతధారలే కురిపించింది నాతల్లి! ఈ చిన్నింట్లో అదో దీపమై వెలిగింది. పాప! శారూ, నీకెప్పుడైనా పాప గుర్తుకొస్తుందా? అడిగేనని బాధపడకు. ఏమిటో శారూ. ఈ జీవితంలో నిన్ను పొందడమనే ఘనకార్యం మినహా నేను మరేం చేయలేక పోయేను. చేయలేను గూడా, నేను అన్నిరకాలా వెనుకబడి పోయిన..."

"ప్లీజ్...ప్లీజ్...నాకు యేమీ గుర్తుచేయకండి. దీన గాథలు చెప్పకండి. మనవెనకా, ముందూ నీడలే! వాటినెంతకాలమని తలుచుకుంటూ గుండెలు పగులగొట్టుకుంటాం? ఎంతకాలం?"

సుబ్బారావు శారద కళ్ళల్లోని నీళ్ళు స్పష్టంగా చూడగలిగేడు. అతను మరింత దగ్గిరగా జరిగి, శారద భుజమ్మీద తలనుంచి మెల్లగా నొక్కేడు.

"ఐలవ్ యూ ఐలవ్ యూ అండ్ ఐలవ్ యూ!"

శారద చలించి పోయింది.

* * *

రమణారావు బంగళా—

ఆ బంగళా ఆవరణలో సూరకరాజు కారాపి కూర్చున్నాడు. అల్లంత దూరంలో రామదాసు రావడం చూచి, పిలిచి అడిగేడు.

"ఏందాసూ, పండా? కాయా?"

"ఏం తెలీదింకా."

"గొప్పోళ్ళతో వ్యవహారం అంత సులువుగా తెలియదురో దాసూ!"

"అయినా, ఇప్పుడు–ఈ సమయంలో నిన్నెవర్రా రమ్మన్నాడు? నువ్వొచ్చి పోడానికి వేళాపాళా లేదర్రా సన్నాసి! ఇవాళికక్కడ అమ్మగారి పండగని తెలుసా?"

పండుగా?"

"అవున్రా, యివాళ ప్రభావతమ్మగారు పుట్టారు."

"ఇవాళా!"

"మరె, వెళ్ళి చూచి రామ్మా, ఇంకా కళ్ళయినా తెరవలేదు. వెధవా, వెధవన్నరవెధవా, యివాళ ప్రభావతమ్మగారి పుట్టినరోజు. అనగా బర్త్‌డే. లోపలంతా గొప్పోళ్లు చేరేరుగాని వీల్లేదు వెళ్ళిపో, అమ్మగార్ని రేపు క్లబ్బుకాడే మళ్ళా కలుసుకో. పోరాపో."

రామదాసు నసుగుతూ అన్నాడు.

"అప్పునోరోయ్ నూకరాజూ! నా గురించి మీా డాక్టరమ్మగారోతోనూ చెపరాట్రా ఏదైనా ఛాన్సొస్తే..."

"ఏడిసేవుగాని నోర్మూయ్. ఇలాంటి తెలివితక్కువ మాటలు నాదగ్గర మాటాడకు. నిన్న, నువ్వు ప్రభావతమ్మగార్ని కలుసుకోడం మా డాక్టరమ్మా చూచింది. నువ్వు ప్రభావతమ్మని ఆశ్రయించేవు గనుక అడంతే. ఈ కేసు అక్కడే తేలాలి ఒకరి పేషెంట్‌ని మరోడు చూడనట్టు (డాక్టర్లు) ఒకరి కేండేటుని మరొకరు చూడరు - నెత్తిమీాద పెట్టుకోరు. తిరకాసు పనుల్నాకు చెప్పకు. వెళ్ళెళ్ళి లిటిగేషను పెట్టి నా ఉద్యోగం తీయకు బాబూ వెళ్లు. అదిగో 'కేకు' గూడా తెగ్గోసినట్టుంది. పాడుతున్నారు హేపీ..."

బంగ్లాలో :

'హేపీ బర్త్‌డేటూయూ!" అయిపోయింది. ఫలహారాలు పుచ్చుకుని యెవళ్ళ సీట్లలో వాళ్లు కూర్చున్నారు. శారద బంగళాంతా చూచి గుండె లదిరిపోగా ఓమూాలన, డాక్టర్ ప్రమీాల ప్రక్కన (సోఫాలో) కూర్చుంది.

పాపపోయిన దగ్గుల్లో డాక్టర్ ప్రమీాల సలహా ప్రకారం లేడీస్ క్లబ్బులో చేరిన మరుక్షణం నుంచీ శారదలో చిత్రమైన మార్పు కలిగింది. పెద్దపెద్ద వాళ్ళెందరో తెలిసేరు. వాళ్ళవాళ్ళ మొగుళ్ళి తెలుసుకుంది. రవణరావు, ప్రభావతిలపట్ల మాత్రం యిాార్ష్య రోజురోజుకీ పెరిగిపోతోంది. దీనికి డాక్టర్ ప్రమీాల మందివ్వలేదు.

పార్టీలో హాస్యాలూ, ఖబుర్ల మధ్య సుగుణా భాను మూర్తి ప్రభావతిని అడిగినది.

"వేర్ఈజ్ మిస్టర్ రమణారావ్ ఐ సే?"

"రాత్రే కేంప్ కెళ్ళిపోయేరు. రెండు రోజులగ్గాని రారు" అన్నది ప్రభావతి.

"వీరా బర్‌డే అని తెలీదూ?"

"అయితే మాత్రం డ్యూటీ?"

శారద రమణారావుని మెచ్చుకోలేక పోయింది. ఎంత డ్యూటీ అయితే మాత్రం భార్య పుట్టినరోజున యిల్లొదిలి పోవడమా? అదే సుబ్బారావైతే—

"మళ్ళా నాకు ప్రేమ గుర్తొచ్చేస్తుంది. నన్ను రొంపిలో దింపేసిన ప్రేమ, నన్ను పూర్తిగా ఓడించిన ప్రేమ, నా కళ్లుమూసి నన్ను దగాచేసిన ప్రేమ! గుర్తొస్తుంది. భగవంతుడా, ఈ ప్రేమొక్కటేనా నాకు కావలసింది?" అని బాధపడింది శారద.

అంతలో, బయట కారాగిన చప్పుడవటంతో పార్టీలోని తలలన్నీ గుమ్మంవేపు తిరిగాయి. గబగబా రమణారావు లోనికి ప్రవేశించాడు.

"గుడీవినింగ్ మిస్టర్ రమణారావ్" అన్నది సుగుణా భానుమూర్తి.

శారద తలెత్తి అతని వేపు చూచింది. రాజకుమారుడిలా వున్నాడతను. క్షణంలో అతని ప్రక్కనే మెరుపుతీగెలా మరోయువతి వొచ్చి నించుంది. ఉలిక్కిపడింది శారద.

"మిస్ సువర్చల, ఎఫేమస్ సినీయాక్ట్రెస్" అన్నాడతను. అని సువర్చలను తీసుకుని మేడమీదకి వెళ్ళిపోయేడు.

పార్టీలోని ఆడంగులంతా ముక్కులమీద వ్రేళ్ళేసుకుని చాలాసేపు నిర్ఘాంత పోయేరు. అంతా నిశ్శబ్దంగా వుంది. రమణారావు నిర్లక్ష్యంగా మేడమీదకి వెళ్ళిపోవడం కంటే, ఆ మెరుపుతీగె తెంపరి తనానికి అబ్బుర పడ్డారు జనం.

"నీ పుట్టింరోజు పండక్కి సినీమానటే వొచ్చింది. ఇంకేం?" అనేసింది విమల కొంచెం వ్యంగ్యంగా.

"కానీ, మేడమీదికి వెళ్ళిపోయిందిగా పాపం!" అన్నదొకావిడ.

"మరి రమణారావుగారు కేంప్ కెళ్ళేరన్నారు" ఎవరో ప్రశ్నించేరు.

"ఎంత సినీయాక్ట్రెస్ తే మాత్రం, నీ పుట్టింరోజు పండుగనీ, యిక్కడున్న యింతమందినీ అవమానం చేయడం ఏంబాగాలేదు!" అన్నది విమల.

"బాగుంది. చాలా బాగుంది నీపార్టీ" ఎత్తిపొడిచారు మరొకావిడ.

అన్ని గొంతుల్లోను, సుగుణా భానుమూర్తి గొంతు మాత్రం ప్రత్యేకతని పుణికి పుచ్చుకుంది_

"ఇష్! ఏంటీ కాకిగోల! కామ్‌గా వుండండి. సినిమా స్టారంటే మాబ్ పడి ఛస్తారు. అందుచేత వూళ్ళో యెవళ్ళకీ తెలీకుండా మిస్టర్ రమణ ఆమెనిక్కడికి తీసుకొచ్చి వుంటారు.

వెరీగుడ్ ప్లాన్. బై దివే, రేపావిడ యీ వూర్లోవుంటే, ప్లీజ్ ఇన్వైట్ హర్ టు అవర్ క్లబ్."

ఏమీ అనలేదు. ప్రభావతి దించిన తల ఎత్తనూ లేదు. అవుతే ప్రభావతి ఏమనుకుంటుందో శారద గమనించింది. అందుచేత శారద ఎంతో తల్లడిలి పోయింది.

అయ్యో ప్రభావతీ! ఇంతవమానమా నీకు? నా కర్థమయింది నీ బాధ. తలెత్తు ఫర్వాలేదు. నువ్వు తల దించుకున్నావుంటే ఈ కాకులు నిన్ను పొడిచేందుకు విజృంభిస్తాయి. తలెత్తు చెల్లీ! తలెత్తు. నేనే పొరబడ్డాను. నీ పట్ల యీర్ష్య పెంచుకున్నాను. నన్ను క్షమించు. అవునవును. నువ్వెంత హోదాలో బతుకుతున్నా యిలాంటి నీడలు నువ్వు సహించలేవు. ఏ స్త్రీ సహించకూడదు. రేప్పొద్దున భానుమూర్తి రవణలానే చేస్తే యెంత చెబుతూన్న సుగుణ వురేసుకోవడం తథ్యం. ఏదైనా తనవరకూ వొస్తేనేగానే తెలీదు. బాధపడకు చెల్లీ! ఏమిటో అనుకున్నాను. అదృష్టం నాది!

అప్పుడు శారదకి సుబ్బారావు కనుపించాడు. ఐలవ్ యూ అన్నాడు. శారద కళ్ళుమూసుకుంది. అప్పుడూ సుబ్బారావే కనిపించి ఐలవ్యూ అన్నాడు. శారద భుజంమీద చల్లటి చేయి పడ్డది. కళ్ళువిప్పి చూచింది.

డాక్టర్ ప్రమీల మెల్లగా అడిగింది.

"ఏదో ఆలోచిస్తున్నావు?"

"నాకు దేవుడు కనిపించాడు డాక్టర్గారూ! రండి వెడదాం వేళవుతోంది" అన్నది శారద.

డాక్టర్ ప్రమీల గబిక్కున నవ్వేసింది. అక్కడ చేరిన వాళ్ళకి ఆ నవ్వేం అర్థం కాలేదు. సుగుణా భానుమూర్తి తన మాటకే డాక్టరు నవ్వినట్టు గమనించి మొహాం ముడుచుకుంది.

ప్రభావతి తలెత్తి చూచింది. ఆమెకి గంభీరముద్ర ధరించిన శారద మొంతో నిండుగా, ప్రశాంతంగా వున్నట్టు కనిపించింది.

— లత మాసపత్రిక నుండి